క్లుప్తంగా

సమష్టిగా సున్నితంగా సమస్యల పరిష్కారం

● తహసీల్దార్ ఎన్వీరమణ, ఎస్సై ఎం.రాజేష్



సమస్యలపై చర్చింకుంటున్న తహసీల్దార్ ఎన్వీ రమణ, ఎస్సై ఎం.రాజేష్

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొనే సమస్యలు న్యాయబద్ధంగా పెద్దమనస్సుతో సున్నితంగా పరిష్కరించడానికి తమ వంతు కృషి చేస్తామని తహసీల్దార్ ఎన్వీ రమణ, ఎస్సై ఎం.రాజేష్ అన్నారు. ఈ మేరకు నూతనంగా ఎస్సై బాధ్యతలు స్వీకరించిన ఎం.రాజేష్ తహసీల్దార్ ఎన్వీ రమణను బుధవారం కలిసి శాఖాపరమైన వివిధ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నిలను పురస్కరించుకుని పోలింగ్ కేంద్రాలు, రూట్ మ్యాప్‌లు, శాంతి భద్రతలపై చర్చించామని తెలిపారు. ఎటువంటి సమస్య వచ్చినా నిబంధనలకు లోబడి సున్నితంగా పరిష్కరించడానికి తమవంతు కృషి చేస్తామని తెలియజేశారు.

డివైడర్లను ఢీ కొట్టిన లారీ

వీరఘట్టం: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న రహదారిపై ఏర్పాటు చేసిన డివైడర్లను బుధవారం తెల్లవారు జామున ఓ లారీ ఢీ కొట్టింది. దీంతో ఆరు డివైడర్ దిమ్మలు కూలిపోగా.. నాలుగు లారీ చక్రాలు విరిగిపోయాయి. భారీ వర్షం కురుస్తున్న సమయంలో రహదారి కనిపించకపోవడంతో డివైడర్లను ఢీ కొట్టినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

పాలకొండ రూరల్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ ఉపకరణాల వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని ట్రాన్స్‌కో ఏఈ శ్యామ్ సుందర్ అన్నారు. మండల పరిధిలో మూడు రోజులుగా విద్యుత్ నిర్వహణ పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆయన మాట్లాడుతూ, గృహ వినియోగదారులు విద్యుత్ స్విచ్‌లను అవసరమైనప్పుడే వేయాలని.. సర్వీసు వైర్లు తెగిపడినా.. జాయింట్ చేసి ఉన్నా అధికారులకు తెలియజేయాలని సూచించారు. వాటర్ మోటార్లు, మిక్సీలు, గ్రైండర్ల వినియోగంలో తగు జాగ్రత్తలు పాటించాలని, సమస్యలు తలెత్తితే 1612 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

రేపటి నుంచి అంగన్‌వాడీల నిరవధిక సమ్మె

గుమ్మలక్ష్మీపురం/కురుపాం: తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం మూసివేసి నిరవధిక సమ్మె చేయనున్నట్టు సీఐటీయూ, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు కె.సరళకుమారి, వి.ఇందిర, సరోజ, సూర్యకుమారి, రాధాకుమారి తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి కురుపాం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఆవరణలో బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి, కురుపాం పోలీస్‌స్టేషన్‌కు నిరవధిక సమ్మెకు సంబంధించి వినతిపత్రం అందజేశారు. తమ డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మెకుదిగుతున్నట్టు తెలిపారు.

ఆప్తమిత్రలు అప్రమత్తంగా ఉండాలి

భామిని: తుఫాన్ తాకిడితో వంశధార నదీతీరంలో కలిగిన నష్టాల పట్ల ఆప్తమిత్రలు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ జె. ఉమామహేశ్వరి సూచించారు మండలంలోని బత్తిలి, కాట్రగడ-బి, నేరడి-బి గ్రామాల పరిధిలో తుఫాన్ తాకిడిపై బుధవారం ఆరా తీశారు. ముందుగా బత్తిలి సచివాలయంలో సిబ్బందికి తుఫాన్ విధులను కేటాయించారు. బత్తిలిలో వెల్ఫేర్ అసిస్టెంట్ గంగారావు ఆధ్వర్యంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. పరిశీలనలో ఆమె వెంట కార్యదర్శులు అనసూయ, సంతోష్‌కుమార్, శ్రీనివాసరావు ఉన్నారు.

పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించండి

పాలకొండ రూరల్: తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాల కారణంగా పారిశుధ్య పనులపై దృష్టి సారించాలని ఎంపీడీఓ డొంక త్రినాథులు అన్నారు. మండంలోని డోలమడ, బెజ్జి, ఓని సింగన్నవలస, తదితర సచివాలయాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి సిబ్బందితో మాట్లాడుతూ, రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. త్వరితగతిన పారిశుధ్య పనులు చేయించాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

భామిని: మండలంలో ఖాళీగా ఉన్న మూడు అంగనవాడీ పోస్టుల భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ శాంతిభవాని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సింగిడి, సవరపాడు, చింతలగూడల్లో గల మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తల పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. సింగిడి, సవరపాడు పోస్టులు ఓసీలకు, చింతలగూడ పోస్టు ఎస్టీకి కేటాయించినట్లు తెలిపారు. ఈ నెల 14వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోకి భామిని ఐసీడీఎస్ కార్యాలయానికి దరఖాస్తులు అందజేయాలన్నారు. ఆయా ప్రాంతాలకు చెందిన అభ్యర్థులు 21 నుంచి 35 ఏళ్ల లోపు వయసుండి, పదో తరగతి అర్హత కలిగి ఉండాలని తెలిపారు.

ముంచిన మిచాంగ్



శివరాంపురంలో నీట మునిగిన వరి కుప్పలు



సీతానగరం: రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ఎన్వీ రమణ, ఏఓ ఎస్.అవినాష్



కొత్తవలసలో నేలరాలిన వరి



బొర్రపనుకువలసలో పొలాల గుండా వెళ్తున్న వరద నీరు



కూర్మరాజుపేటలో నీటమునిగిన వరిపంట



దండిగాం కాజ్‌వే మీదుగా ప్రవహిస్తున్న వరద నీరు

సాలూరు:

మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో మంగళ, బుధవారాల్లో సాలూరులో అత్యధికంగా 78.4 మి.మి.వర్షపాతం నమోదైంది. నియోజకవర్గంలోని పాచిపెంటలో 69.0, మక్కువలో 74.4 మి.మి. వర్షపాతం నమోదైంది. మిచాంగ్ తుఫాన్ వల్ల పట్టణం, మండలంలో ప్రజలు, రైతులు ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా వరి, మొక్కజొన్న, పత్తి పంటలకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు వాపోతున్నారు. జనవరివలస, దత్తివలస, కూర్మరాజుపేట, మామిడిపల్లి తదితర ప్రాంతాల్లో వరి, తుపాకివలస,పసుపునివానివలస, బొర్రపనుకువలస తదితర ప్రాంతాల్లో మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది. కొన్నిచోట్ల పంట నేలకు వంగిపోగా, మరికొన్ని ప్రాంతాల్లో పంటలు నీటమునిగాయి. ఈ సందర్భంగా ఎంపీడీఓ పార్వతి, వ్యవసాయశాఖాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంటల నష్టం అంచనా వేస్తున్నారు. మండలంలో సువర్ణముఖి, గోముఖి, వేగావతి తదితర నదుల వద్ద ఉన్న ప్రజలను అధికారులు, వలంటీర్లు అప్రమత్తం చేశారు. దండిగాం, తోణాం తదితర ప్రాంతాల్లో కాజ్‌వేల మీదుగా వరద నీరు ఉధృతంగా ప్రవహించింది.

నీటమునిగిన వరి కుప్పలు

సీతానగరం: 'మిచాంగ్ ' తుపాను కారణంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మళ్లలోని వరిచేను కుప్పలు నీటమునగడంతో ధాన్యం నష్టవాటిల్లకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని, ధాన్యం రంగుమారినా కొనుగోలు చేస్తామని సీతానగరం తహసీల్దార్ ఎన్వీరమణ, ఏఓ ఎస్ అవినాష్‌లు అన్నారు. ఈ మేరకు వారు రెడ్డివానివలస, రామవరం, బగ్గందొర వలస గ్రామాల్లోని మడులలో వరిచేను కుప్పలు ఓవులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు రోజులుగా కురుస్తున్న చిత్తడి వర్షాల కారణంగా లోతట్టు భూములకు ఎగువ నుంచి నీరు వచ్చిపడడంతో వరిచేను కుప్పలు తడిసిపోయాయన్నారు. మడులలో నీరు నిల్వ లేకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న రైతుసంఘం జిల్లా, మండల నాయకులు రెడ్డి ఈశ్వరరావు, ఆర్‌వీ రమణమూర్తి, ఆర్ లక్ష్మునాయుడు మాట్లాడుతూ పంటనష్టాల్ని అంచనాలు వేసి పరిహారం వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ఎస్ శ్రీనివాసరావు, వ్యవసాయ సహాయకులు, గ్రామ వంలటీర్లు,రైతులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా జగనన్న పాలన



సాలూరు: పెదహరిజనపేటలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసినివాళులర్పిస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు



బలిజిపేట: పెదపెంకిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన సర్పంచ్ పాపారావు



పాచిపెంట: అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ బి.ప్రమీల



సాలూరు: మండల పరిషత్ కార్యాలయంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, ఎంపీడీఓ పార్వతి తదితరులు

సాలూరు: భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ముఖ్య మంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పాలన సాగిస్తున్నారని ప్రజాప్రతినిధులు, నాయకులు అన్నారు. అంబేడ్కర్ 67వ వర్ధంతి సందర్భంగా బుధవారం సాలూరు పట్టణంలోని పెద, చినహరిజనపేటలు, బంగారమ్మపేట, మండల పరిషత్ కార్యాలయం తదితర ప్రాంతాల్లో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జగనన్న పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సమధర్మం, సమన్యాయం అందిస్తున్నారని పేర్కొన్నారు. అంబేడ్కర్ అమరజీవి అని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు జర్జాపు సూరిబాబు, గిరిరఘు, సింగారపు ఈశ్వరరావు, లక్ష్మణరావు, మజ్జిఅప్పారావు, వైస్‌ఎంపీపీ రెడ్డి సురేష్, ఎంపీడీఓ పార్వతి పాల్గొన్నారు.

పాచిపెంటలో..

రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని పాచిపెంట ఎంపీపీ బద్నాన ప్రమీల అన్నారు. అంబేడ్కర్ వర్ధంది సందర్భంగా పాచిపెంటలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంబేడ్కర్ చూపించిన బాటలోనే మనమందరం నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీకాంత్, ఏఓ పాత్రుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు వీరంనాయుడు, ఎంపీటీసీ దండి ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేటలో..

అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని బలిజిపేట మండలంలోని వాడవాడలా బుధవారం నిర్వహించారు. అందులో భాగంగా పెదపెంకి ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి సర్పంచ్ ఎస్.పాపారావు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పాపారావు మాట్లాడుతూ ఆ మహనీయుని సేవలు మరువలేనివని కొనియాడారు. బడుగువర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహనీయుడని, అటువంటి నాయకులను మరిచిపోలేమన్నారు. బలిజిపేటలో అంబేడ్కర్ సేవా సమితి ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడగా ఎస్సై ప్రశాంత్‌కుమార్, ఎం.ఆనందరావు, బి.రామారావు, నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవనాయుడు, వి.గంగరాజు, డి.సీతారాం పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన

● నేడు ఎన్నికల రోల్ అబ్జర్వర్ రాక



రాజకీయపార్టీ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో జేసీ గోవిందరావు

పార్వతీపురం: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లాలో శాశ్వత సెంటర్లు, మొబైల్ ప్రదర్శన వ్యాన్‌లు ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల రోల్ అబ్జర్వర్, ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె శ్యామలరావు ఈ నెల 7వ తేదీన జిల్లాకు వస్తున్నారని, ఆయన నిర్వహించే సమావేశానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరై వారి సలహాలు, అభిప్రాయాలు తెలియజేయాలని పిలుపునిచ్చారు. అక్టోబరు 27న ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేసినట్లు చెప్పారు. ముసాయిదా ఓటరు జాబితాపై క్లెయిమ్‌లు, అభ్యంతరాలను డిసెంబరు 9 వరకు స్వీకరించనున్నామని తెలిపారు. ఇంకా మూడు రోజులే సమయమున్నందున రాజకీయపార్టీల ప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పించి, ఓటర్లు ముసాయిదా ఓటరు జాబితా తనిఖీ చేసుకుని క్లెయిమ్‌లు, అభ్యంతరాలుంటే తెలియజేసి శుద్ధమైన ఓటరు జాబితా తయారీకి సహకరించాలని కోరారు. డిసెంబరు 26 నాటికి వాటిని పరిష్కరించనున్నట్లు చెప్పారు.

జనవరి 5న తుది జాబితా

2024 జనవరి 5న ప్రచురణకు తుది జాబితా సిద్ధమవుతుందని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాలమేరకు డిసెంబరు 2, 3 తేదీలలో నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో ఫారం-6 4,555 దరఖాస్తులు, ఫారం- 7 2,017 దరఖాస్తులు, ఫారం-8 1856 దరఖాస్తులు స్వీకరించామని జరిగిందని, వాటిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎలక్ట్రానిక్ ఓటింగు మెషీన్, వీవీ ప్యాట్ పనితీరు, ఓటు వేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా ఎన్నికల కార్యాలయం, రిటర్నింగ్ అధికారి ప్రధాన కార్యాలయం, రెవెన్యూ సబ్ డివిజన్ అధికారుల వద్ద శాశ్వత సెంటర్లు, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి మొబైల్ ప్రదర్శన వ్యాన్‌న్ ఏర్పాటు చేశామని, మొబైల్ వ్యాన్ షెడ్యూల్ ముందుగా తెలియజేస్తామని చెప్పారు. ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రోత్సహించాలని జాయింట్ కలెక్టర్ కోరారు. జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 1,69,181 ఫారాలు స్వీకరించగా, వాటిలో 1,46,829 ఫారాలు పరిష్కరించి ఓటరు జాబితాలో చేర్చామని, 1226 ఆమోదించి, 3988 తిరస్కరణకు గురయ్యాయని, 17,138 పరిష్కరించవలసి ఉందని తెలిపారు. ఎలక్ట్రానిక్ ఓటింగు మెషీన్లపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు గిరిజన, గ్రామీణ ప్రాంతాలలో విస్తృతంగా చేపట్టాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు కోరారు. సమావేశంలో రాజకీయపార్టీల ప్రతినిధులు వి.శ్రీనివాసరావు, జి.వెంకటనాయుడు, పి.రవికుమార్ పాల్గొన్నారు.

ఆడుదాం-ఆంధ్రాను విజయవంతం చేయాలి



ఆడుదాం-ఆంధ్రా లోగోను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శ్రీరాములు నాయుడు

సీతానగరం: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేసిన ఆడుదాం-ఆంధ్రా క్రీడాపోటీలను యవతీ యువకులు విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఎంఎల్ ఎన్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు బుధవారం మండల పరిషత్ సిబ్బందితో కలిసి ఆడుదాం అంధ్రా క్రీడల లోగోను వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు బి.శ్రీరాములునాయుడు, ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 15న నియోజకవర్గ స్థాయిలో జరగనున్న క్రీడల్లో 15 సంవత్సరాలు వయస్సు పైబడిన యువతీ, యువకులు పాల్గొనడానికి అర్హులన్నారు. యువతీ, యువకులకు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు నియోజకవర్గ స్థాయి నుంచి జిల్లా, రాష్ట్రస్థాయిలో జరుగుతాయని చెప్పారు. యువతీయువకుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని, వ్యాయామ విద్యను వెలికితీయడానికి ఈ క్రీడలు దోహద పడతాయని చెప్పారు. క్రీడల్లో పాల్గొననున్న యువతీ, యువకులు సమీపంలోని సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

లింగ వివక్ష తగదు



గురుకుల పాఠశాల ఆవరణలో మానవహారగాం

గరుగుబిల్లి: లింగ వివక్షత తగదని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం ప్రిన్సిపాల్ ఎస్.సంధ్యారాణి అన్నారు. మండల కేంద్రంలోని గురుకులంలో డాక్టర్ వైఎస్సార్ వెలుగు సిబ్బంది ఆధ్వర్యంలో లింగ వివక్షతపై మానవ హారాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వెళ్తున్నారన్నారు. కార్యాలయాల్లో, పని ప్రదేశాల్లో మహిళలను కించ పరిచేలా చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మహిళలకు రక్షణగా పలు చట్టాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. వెలుగు ఏపీఎం పి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పంచగవ్య తయారీపై రైతులు దృష్టి సారించాలి

తెర్లాం: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా రైతు లు సాగు చేస్తున్న కూరగాయలు, మామిడి తోటల్లో పూత, పిందె దశలో ఎటువంటి లోపా లు లేకుండా ఉండేందుకు పంచగవ్య ఎంతగా నో దోహదపడుతుందని, దీని తయారీపై రైతు లు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రకృతి వ్యవసాయం పూనువలస క్లస్టర్ మండల యాంకర్ ఆర్నేపల్లి సింహాద్రినాయుడు అన్నారు. మండలంలోని నందిగాం గ్రామంలో పంచగవ్య తయారీపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి తక్కువ ఖర్చుతో పంచగవ్య ద్రావణాన్ని తయారు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌పీ దమయంతి తదితరులు పాల్గొన్నారు.

అంతా అప్రమత్తంగా ఉండాలి..



వర్తక సంఘం భవనంలో సమావేశమైన వ్యాపారులు

గుమ్మలక్ష్మీపురం: గ్రామంలో గత కొన్ని రోజుల నుంచి చిన్న చిన్న దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తం కావాలని గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బి.గౌరీశంకరరావు అన్నారు. వర్తక సంఘం అధ్యక్షుడు విష్ణు ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం స్థానిక వర్తక సంఘం భవనంలో గ్రామపెద్దలు, వ్యాపారులతో సర్పంచ్ వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ షాపుల వద్ద చిన్న చిన్న దొంగతనాలు జరిగాయంటూ పలువురు వ్యాపారులు తమ దృష్టికి తీసుకొచ్చిన నేపథ్యంలో, గ్రామంలోని పలుచోట్ల ఏర్పాటు చేసిన సీసీ టీవీ కెమెరాలను పరిశీలించడం జరిగిందని, అందులో ఐదుగురు గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి 12 గంటల సమయంలో సంచరిస్తున్నట్టు గుర్తించి, ఎల్విన్‌పేట పోలీసులకు సమాచారం అందజేసినట్టు తెలిపారు. ముందస్తు చర్యల్లో భాగంగా ప్రజలంతా అప్రమత్తంగా ఉండి, అపరిచిత వ్యక్తుల సంచారం గుర్తిస్తే తక్షణమే పోలీసులకు లేదా పంచాయతీ పెద్దలకు సమాచారం అందివ్వాలని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ పాలక ప్రేమానంద్, వైశ్య సంఘం అధ్యక్షుడు గుడ్ల హరిప్రసాద్, వైస్ సర్పంచ్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా తాగునీటి పథకాల నిర్వహణ

గుమ్మలక్ష్మీపురం:

తాగునీటి పథకాలను సక్రమంగా నిర్వహించుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ కె.నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని వంతరగూడ గ్రామంలోని సోలార్ ఆధారిత తాగునీటి పథకం, బోర్‌ను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆ గ్రామస్తులతో మాట్లాడుతూ తాగునీటి పథకాలను సక్రమంగా నిర్వహించుకోవాలని, రెగ్యులర్‌గా ట్యాంకును శుభ్రపరచి, క్లోరినేషన్ చేయించుకోవాలని, బోర్ చుట్టూ చెత్తా చెదారాలు ఉండకుండా శుభ్రంగా ఉంచుకోవాలంటూ సూచనలు చేశారు.

శ్రీమద్భగవద్గీత పారాయణం

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీ కోదండ రామాలయం ప్రాంగణంలో తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ విజయనగరం శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ ప్రవచన కర్త రాగోలు శంకరరావుచే శ్రీమద్భగవద్గీత పారాయణం చేశారు. బుధవారం నుంచి ఈ నెల 23వరకు 18 రోజుల పాటు రోజుకు ఒక అధ్యాయం చొప్పున్న పారాయణం చేయనున్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన భక్తులతో పాటు ఆలయ చైర్మన్ ఎం.సత్యనారాయణ, ఆలయ ధర్మకర్తలు, జట్టు వ్యవస్థాపకులు డి.పారినాయుడు, తదితరులు ఉన్నారు.

శ్మశాన వాటికకు రహదారి కోసం వినతి

బాడంగి: పినపెంకి వేగావతి నది ఒడ్డున గెడ్డ పోరంబోకు స్థలంలో గదబవలస గ్రామానికి చెందిన ఎస్టీలంతా శ్మశాన వాటిక ఏర్పాటు చేసుకున్నామని రహదారి సౌకర్యం కల్పించాలని ఆ గ్రామస్తులు తహసీల్దార్ రఫీజాన్‌కు బుధవారం విన్నవించారు. శ్మశానవాటిక లేక ఇబ్బందులు పడుతున్నామని, స్పందనలో జేసీకి విన్నవించుకున్నామని, ఇప్పటికైనా రహ దారి సౌకర్యం కల్పించాలని కోరారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో గ్రామస్తులు వి.చినఅప్పలస్వామి, సతీష్, లక్ష్మి, రాజాన పద్మజ తదితరులు ఉన్నారు.